

రేగట్టెలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

## వైద్యరంగానికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- రేగట్టెలో పీహెచ్‌సీ సబ్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన

నల్లగొండ సిటీ, అక్టోబర్ 8 :రాష్ట్రంలో వైద్యరంగానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. కనగల్ మండలం రేగట్టెలో రూ.20 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం హెల్త్ హబ్‌గా మారనుందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో ఒక ప్రాథమిక ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే రేగట్టెలో గ్రంథాలయం ఏర్పాటుకు రూ.10 లక్షలు అందజేస్తానని ప్రకటించారు.

### చెక్ డ్యామ్ పనులకు శంకుస్థాపన

నల్లగొండ సిటీ : చండూరు మండలం పడమటి తండా గ్రామ పరధిలో గల జిలాయిపల్లి వాగు పరిధిలో చెక్ డ్యామ్, రేగట్టె వెళ్లే కాల్వ పనులను ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్ రైతుబంధుతో ఎకరానికి రూ. 10వేల పంట పెట్టుబడి అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమాలో ఎంపీపీ కరీంపాషా, జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, సింగిల్‌విండో చైర్మన్ వంగాల సహదేవారెడ్డి, దోటి శ్రీనివాస్, సర్పంచ్ కడారి కృష్ణయ్య, డాక్టర్ సౌజన్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్ తదితరులుపాల్గొన్నారు.



పాలిటెక్నిక్ కాలేజ్ హాస్టల్ భవనం

# సూర్యాపేటకు మరిన్ని నిధులు

- మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు రూ.25 కోట్లు విడుదల..జీఓ జారీ
- సీఎం కేసీఆర్ మరో హామీ అమలు
- మంత్రి జగదీశ్‌రెడ్డి చొరవతో అభివృద్ధి పరుగులు

సూర్యాపేట, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : నేడు సూర్యాపేట పట్టణంలో ఎటు చూసినా వెలుగు జిలుగులే. కార్పొరేట్‌ను తలదన్నేలా భారీ ప్రభుత్వ భవంతులు, మూసీ మురుగు నీరు మాయమై స్వచ్ఛమైన మిషన్ భగీరథ జలాలు, అహ్లాదాన్ని పంచే పార్కులు, మినీ ట్యాంక్‌బండ్, బోటింగ్‌లతో పాటు అత్యాధునిక సౌకర్యాలతో మహాప్రస్థానం, సకల సదుపాయాలతో వైకుంఠ ధామాలు, విశాలమైన రోడ్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, వాటర్ ఫౌంటైన్లు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు. ఇక చిన్న వానలకే చెరువులను తలపించిన విద్యానగర్, 60 ఫీట్ల రోడ్డు, చర్చి కాంపౌండ్‌ల ముంపు తిప్పలు నాళా నిర్మాణంతో తొలగిపోయాయి. మొత్తం మీద తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో సూర్యాపేట అభివృద్ధిలో పరుగులు పెడుతున్నది. సూర్యాపేటకు ముఖ్యమంత్రి వచ్చినా ఇతర ఏ శాఖ మంత్రి వచ్చినా జిల్లా కేంద్రానికి కావాల్సిన వాటితో పాటు జిల్లాలో ఇంకా మిగిలి ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ సూర్యాపేట పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు తాజాగా రూ. 25 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది.

### ప్రతి ఒక్క హామీ అమలు

సీఎం ఇచ్చిన హామీల్లో 475 పంచాయతీలకు రూ.47.50 కోట్లు విడుదల చేస్తూ జీఓ విడుదల కాగా అనంతరం వరుసగా రూ.25 కోట్లతో భానుపురి కళాభారతితో పాటు రూ.50 కోట్లతో స్టేడియం, రూ.25 కోట్లతో స్పోర్ట్స్ స్కూల్ నిర్మాణం, అనంతరం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్ నిర్మాణానికి రూ.10 కోట్లు విడుదలయ్యాయి. తాజాగా సీఎం మరో హామీయైన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల, హాస్టల్ భవనాల నిర్మాణాలకు రూ.25 కోట్లు విడుదలయ్యాయి. అడిగిన వెంటనే హామీ ఇవ్వడమే కాకుండా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుండడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజల పక్షాన మంత్రి జగదీశ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యతోనే జీవితానికి వెలుగులు

- సీఎం కేసీఆర్ కృషితోనే విద్యారంగం అభివృద్ధి
- కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు
- మన ఊరు-మనబడితో స్కూళ్లకు కొత్త రూపు
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- చివ్వెంల మండలం ఐలాపురం వద్ద బాలిక గిరిజన గురుకుల విద్యాలయం ప్రారంభం



బొడ్రాయిబజార్ : 7వ వార్డులో ఎరుకల కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

చివ్వెంల, అక్టోబర్ 8 : విద్యతోనే జీవితానికి వెలుగు వస్తుందని నమ్మే ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధి చెందిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. శనివారం రాత్రి చివ్వెంల మండలంలోని ఐలాపురం క్రాస్ రోడ్డు వద్ద హైదరాబాద్– ఖమ్మం రహదారి పక్కన రూ.4.2 కోట్లతో నిర్మించిన తెలంగాణ గిరిజన గురుకుల కళాశాల, పాఠశాల భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంతకు ముందు విద్యార్థులు మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ర్యాంక్‌లు సాధించి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. సమాజాన్ని పీడిస్తున్న కులాల అంతరాలు పోవాలంటే విద్య వల్లే సాధ్యమని తలంచి సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వెయ్యి గురుకులాలను నెలకొల్పినట్లు తెలిపారు. ఆడ పిల్లలు సౌకర్యాలు లేక విద్యను మధ్యలోనే ఆపివేస్తున్నారని, వారికి రెసిడెన్సియల్ కళాశాలలు ఏర్పాటు చేసి ప్రభుత్వం అధిక నిధులు వెచ్చించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కళాశాల కాంపౌండ్ వాల్, రోడ్డు నిర్మాణం, సోలార్ స్ట్రీట్ లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు త్వరలోనే పనులు ప్రారంభిస్తారని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో జట్పీటీసీ భూక్యా సంజీవ్‌నాయక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, సర్పంచ్ బోడపట్ల సునీతాశ్రీను, ఎంపీటీసీ బుచ్చమ్మ, కళాశాల ఆర్సీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ మంజుల, ఉప సర్పంచ్ వినోద్, జిల్లా నాయకులు గుర్రం సత్యనారాయణరెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.

### అన్ని వర్గాల అభ్యున్నతే సీఎం కేసీఆర్ లక్ష్యం..

బొడ్రాయిబజార్ : సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నదని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి సూర్యాపేటలోని దాసాయిగూడెంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, 23వ వార్డులో మాల కమ్యూనిటీ హాల్, 7వ వార్డులో ఎరుకల కమ్యూనిటీ హాళ్లను ప్రారంభించడంతో పాటు 21వ వార్డులో నూతనంగా నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ఆయా కుల సంఘాల ఆత్మగౌరవ భవనాలను నిర్మించి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. 2014 తర్వాత సూర్యాపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని రాబోయే కాలంలో మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. సూర్యాపేటను రాబోయే రోజుల్లో దేశంలోనే నంబర్ వన్ పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలబడి అభివృద్ధిలో భాగస్వామ్యం అందించాలని కోరారు. అన్ని మతాలు, జాతులు, సంస్కృతులను సమానంగా గౌరవిస్తున్న ఏకైక రాష్ట్రం, ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ మాత్రమే అన్నారు. సూర్యాపేట అభివృద్ధిపై గతానికి, ప్రస్తుతానికి ఉన్న పరిస్థితులను ప్రజలు బేరీజు వేసుకుని అభివృద్ధికి అండగా నిలబడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కమిషనర్ పి.రామానుజులరెడ్డి, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, కౌన్సిలర్లు వల్దాస్ సౌమ్యా జాని, కుంభం రేణుకారాజేందర్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గండూరి ప్రకాశ్, కుంభం రాజేందర్, బత్తుల జాని, వల్దాస్ జాని, గాజుల రాంబాయమ్మ, యశోదారవి, బొల్లెద్దు దశరథ, మీర్జాల వేణు బలరాం, అంబేద్కర్ యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ పాశం రాంరెడ్డి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న జడ్పీటీసీ పాశం రాంరెడ్డి

తిప్పర్తి, అక్టోబర్ 8: మండలంలోని కాశీవారిగూడం గ్రామానికి చెందిన షేక్ మౌలానా ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ పాశం రాంరెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలానా కుటుంబాన్ని అన్నివిధాలు ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో కాశివారిగూడెం బీఆర్‌ఎస్ నాయ కులు ఎస్‌కే అబ్దుల్ రహీం, రంజాన్, బషీర్, ఎస్‌కే కరీం, కలీం పాల్గొన్నారు.

## 12న సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సు



కరపత్రం ఆవిష్కరిస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

నల్లగొండ రూరల్,అక్టోబర్ 8: ఈనెల 12న సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ అవగాహన సదస్సు కరపత్రం శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు మాట్లాడుతూ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించే సదస్సుకు మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం మాజీ చీఫ్ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, రాష్ట్ర కన్వీనర్ ఉషారాణి, శ్రీనివాస్, వెంకటేశ్, సుందర్ నాయక్, ఆర్థం రామ్ పాల్గొన్నారు.

## 12న ఎంవీఎన్ ట్రస్ట్ అర్థోపెడిక్ ఉచిత వైద్య శిబిరం

రామగిరి, అక్టోబర్ 8: ఎంవీఎన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ దినోత్సవం సంద ర్భంగా మో కాళ్ళు, కీళ్ల నొప్పులు, బొక్కలు, వెన్నునొప్పితో బాధపడుతున్న వారికి ఈనెల 12న ట్రస్ట్ కార్యనిర్వహక కార్యదర్శి పి.నర్సిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నల్లగొండలోని దేవరకొండ రోడ్డులోని సత్యవతి మల్టీ స్పెషాలిటీ దవాఖాన(నేషనల్ ఫంక్షన్ హాల్ ఎదురుగా) హాజరై సద్వినియోగం చేసుకో వాలన్నారు. డాక్టర్ మల్లు అరుణ్ కుమార్‌రెడ్డి, డాక్టర్ రాంమనోహర్ వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. వివరాలకు 9490098311 సంప్రదించాలని సూచించారు.

## సర్వారం వాసికి ఓయూ డాక్టరేట్

గరిడేపల్లి, అక్టోబర్ 8 : మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన పాలూరి రాజయ్య, జోగమ్మ దంపతుల కుమారుడు అంజయ్య రసాయన శాస్త్ర విభాగంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించాడు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సిల్వర్ గోల్డ్, పెల్లాడియం నానో మెటీరియల్స్ అనే అంశంపై ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్ ఆధ్వర్యంలో చేసిన పరిశోధనలకు గాను డాక్టరేట్ వచ్చినట్లు తెలిపారు. అంజయ్యకు డాక్టరేట్ రావడంపై ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ఆయన అభినందనలు తెలిపారు.